## బాధ్యతలు స్వీకరించిన జెసి రాహుల్ మీనా

ప్రజాశక్తి - కాకినాడ

జాయింట్ కలెక్టర్గా రాహుల్ మీనా బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్లోని తన చాంబర్లో శుక్రవారం ఆయన జెసిగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్ మీనా ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్ కలెక్టర్గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. 2021 బ్యాచ్కి చెందిన మీనాది స్వరాష్ట్రం రాజస్థాన్. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ తాను తొలుత 2021లో కడప ట్రైనీ కలెక్టర్గా బాధ్యతలు చేపట్టానని చెప్పారు. జిల్లాలో అన్ని సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జెసిగా బాధ్యతలు స్వీకరించిన మీనాను జిల్లాకు చెందిన పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జెసి రాహుల్మీనా

# గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తాం...

### సెప్టెంబర్ 11 నుంచి నూతన ఇసుక పాలసీ
### ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కొత్తపేట, అమలాపురం

గ్రామాలను తిరిగి అభివృద్ధి బాట పట్టిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వానపల్లిలో శుక్రవారం జరిగిన స్వర్ణగ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒకే రోజున 13,226 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామన్నారు. గత ఐదేళ్లలో ఒక్కసారైనా గ్రామ సభ నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. నాడు సిఎం వస్తున్నాడంటే ప్రజలపైనా ఆంక్షలు ఉండేవన్నారు. కాని ఇప్పుడు మహిళలు స్వేచ్ఛగా వచ్చి సభలో కూర్చున్నారని తెలిపారు. తమది సింపుల్ గవర్నమెంట్...ఎఫెక్టివ్ గవర్నెన్స్' అని అన్నారు. గత ప్రభుత్వంలో నరేగా బిల్లులు నేతల జేబుల్లోకి వెళ్లాయన్నారు. ఉపాధికి ఈ సభ ద్వారా రూ.4,500 కోట్లు మంజూరు చేస్తున్నాం. రాష్ట్రం మొత్తంగా 87 రకాల పనులను గ్రామాల్లో చేయడానికి గ్రామసభల ద్వారా ఆమోదించామన్నారు. 54 లక్షల కుటుంబాలకు నరేగా ద్వారా పని దొరకుతుందన్నారు. 2014 నుండి 2019 మధ్య గ్రామాల్లో అన్ని పనులు చేసి స్వర్ణయుగంగా మార్చామన్నారు. 2019 తర్వాత ఒక్క పని కూడా గ్రామాల్లో చేయలేదు. నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎంఎల్ఎ ఎంత ముఖ్యమో, గ్రామానికి సర్పంచి కూడా అంతే ముఖ్యమన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు కూడా అపహాస్యం చేసిందన్నారు.

గ్రామసభకు వచ్చిన వారిని పలుకరిస్తున్న సిఎం చంద్రబాబు

జగన్ లాంటి వ్యక్తులు సమాజానికి చేటు అన్నారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తు కావాలంటే వైసిపిని భూస్థాపితం చేయాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి రూ.2,100 కోట్లు రాబోతున్నాయని తెలిపారు. ఎన్టిఆర్ జలసిరి కింద 32,693 బోర్లు తవ్వి పంపుసెట్లు పెడితే, గత ప్రభుత్వం 2,550 బోర్లు మాత్రమే వేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం స్వచ్ఛభారత్ డబ్బులు కూడా ఖర్చు చేయలేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో సిసి రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. 4.5 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్, 5 లక్షల పంటకుంటలు, 1.5 లక్షల పశువుల షెడ్లు నిర్మిస్తామన్నారు. 15 కోట్ల నుంచి 21.50 కోట్లకు ఉపాధి హామీ పని దినాలు పెంచామని, కూలి రేట్లు కూడా పెంచుతామని తెలిపారు. పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. త్వరలోనే 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు.

రూ.10 లక్షల కోట్ల అప్పులతో పాలన ప్రారంభించామన్నారు. అయినప్పటికీ 1వతేదీనే ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు ఇస్తున్నామన్నారు. వాలంటీర్లు లేకుండా ఒకే రోజున 98 శాతం పింఛన్లను ప్రభుత్వ యంత్రాంగంతో అందించామని తెలిపారు. వికలాంగులకు పింఛను రూ.3 వేల నుండి రూ.6 వేలకు పెంచామన్నారు. లేచి తిరగలేని వారికి రూ.15 వేలు పింఛను ఇస్తున్నామన్నారు.

నైపుణ్య గణన చేపట్టి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. రైతులకు పెట్టుబడి భారాన్ని తగ్గిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 11 నుంచి నూతన ఇసుక పాలసీ అమల్లోకి తెస్తామన్నారు. పోలవరం డయాఫ్రంవాల్, గైడ్ బండ్, కాఫర్ డ్యాం దెబ్బతిన్నాయి. 2021 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్టు మొత్తం పడకేసింది. డయాఫ్రం వాల్ కొత్తది కట్టాల్సి వస్తోంది. లేదంటే ఉభయ గోదావరి జిల్లాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు అదనంగా భారం పడుతోందని తెలిపారు. రైతులకు గత ప్రభుత్వం పెట్టిన రూ.1674 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించామన్నారు. ధాన్యం అమ్మిన రెండు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తామని తెలిపారు.

వానపల్లి గ్రామంలోనూ కొన్ని సమస్యలు ఉన్నాయి. రూ.10.20 కోట్లతో 16 పనులకు నేడు ఆమోదం తెలుపామన్నారు. సంపద ఉన్నవారిలో 20 శాతం మంది పేదరికంలో ఉన్న 20 శాతం మందిని ఆదుకుంటే ఆర్థికంగా పైకి వస్తారు. జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమం తీసుకొస్తామన్నారు.

ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు అన్న నిబంధన రద్దు చేశామన్నారు. ప్రపంచంలో తెలుగువాడు అగ్రస్థానంలో ఉండాలి, తలసరి ఆదాయంలో తెలుగువారు చిరునామాగా ఉండాలి అన్నదే తమ ఆశయమన్నారు. ఈ సభ సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీ హరీష్మాథూర్, మంత్రి సుభాష్, ఎంఎల్ఎలు బండారు సత్యానందరావు, దాట్ల బుచ్చిబాబు, గిడ్డి సత్యనారాయణ, ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంఎల్ఎ వర్మ, కలెక్టర్ ఆర్.మహేష్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సిఎంకు ఘన స్వాగతం

**అయినవిల్లి :** వానపల్లి గ్రామ సభలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అయినవిల్లి హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. అమలాపురం ఎంపీ గంటి హరీష్మాథూర్, కలెక్టర్ రావిరాల మహేష్కుమార్, పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు తదితులు బొకేలు అందించి స్వాగతం పలికారు.

క్విజ్కు సంబంధించి పోస్టర్లను బ్యాంక్ అధికారులతో కలిసి ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

## రుణాలు అందించేలా చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ

ఖరీఫ్ సాగులో రైతులకు అవసరమైన రుణాలను విరివిగా అందించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షాన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు రైతులకు, కౌలు రైతులకు సాగుకు అవసరమైన ఆర్థిక సాయంను బ్యాంకర్లు అందజేయాలని తెలిపారు. బ్యాంకుల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రైతులు సాగుకు అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువులు కొనుగోలు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బ్యాంకర్లు చొరవ చూపి రుణాలను మంజూరు చేయాలన్నారు. జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగమైన పశు సంవర్థక శాఖ ద్వారా ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి కూడా పశువుల కొనుగోలు నిమిత్తం రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. సిసిఆర్సి కార్డులు కలిగిన రైతులందరికీ విధిగా రుణాలు మంజూరు చేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కూడా పెంచాలని ఆయన సూచించారు. స్వయం సహాయక సంఘాలకు ఈ ఏడాది 26,916 సంఘాలకు రుణాలుగా రూ.1729.46 కోట్లు ఇవ్వాలనేది లక్ష్యమని, ఇప్పటివరకు 2,645 సంఘాలకు రూ.208.30 కోట్లు మాత్రమే ఇచ్చారని, మిగిలిన సంఘాలకు రుణాలు అందించాలని ఆయన సూచించారు. ఆర్బిఐ ఎజిఎం పిఎం పూర్ణిమ, లీడ్ బ్యాంక్ మేనేజర్. సిహెచ్ఎస్వి.ప్రసాద్ మాట్లాడారు. ఈ సమావేశంలో జెసి రాహుల్ మీనా, నాబార్డ్ డిఎం వై.సోమినాయుడు, యూనియన్ బ్యాంక్ ఆర్ఎం, కన్వీనర్ లీడ్ బ్యాంక్ కె.సాయిమనోహర్, డిఆర్డిఎ పిడి శ్రీరమణి, వ్యవసాయ శాఖ జెడి విజయకుమార్, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు, హార్టికల్చర్ అధికారి మల్లికార్జునరావు, మెప్మా పిడి ప్రియంవద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ను నిర్వహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

అనకాపల్లి సెజ్లోని ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ను నిర్వహించాలని సిఐటియు డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక ఎడిబి రోడ్డులోని వాలు తిమ్మాపురం సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. రాజకుమార్ మాట్లాడుతూ పరిశ్రమలలో మిషనరీల నాణ్యత లోపం కార్మికులను పొట్టన పెట్టుకుంటుంద న్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సంపాదించాలనే యజమానుల ఆలోచన ప్రమాదాలకు కారణ మవుతున్నాయని విమర్శించారు. ఫ్యాక్టరీల తనిఖీ అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టకపోవడం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతి కుమార్, సామర్లకోట సిఐటియు మండల కార్యదర్శి సురేష్, నాయకులు వడ్డి సత్యనారాయణ, ఆదిరెడ్డి శ్రీను, నీలం శ్రీను పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

# అభివృద్ధిలో గ్రామసభలే కీలకం

**విజన్ 47 రూపకల్పనలో గ్రామ సభల నిర్వహణ కీలకపాత్ర పోషిస్తాయని కలెక్టర్ షాన్మోహన్ అన్నారు. 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను గుర్తించేందుకు శుక్రవారం చేపట్టిన గ్రామ సభలు విజయవంతంగా జరిగాయి. జిల్లాలోని అన్ని పంచాయతీల పరిధిలో జరిగిన గ్రామ సభల్లో కలెక్టర్, ఎంపి, ఎంఎల్ఎలు పాల్గొని గ్రామాల్లో నెలకున్న సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.**

ప్రజాశక్తి - యంత్రాంగం

**పిఠాపురం** విజన్-2047 రూపకల్పనలో గ్రామ సభల నిర్వహణ కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ షాన్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలో చిత్రాడ గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. విజన్-2047 రూపకల్పనలో భాగంగా గ్రామ అవసరాలను గుర్తించి, భవిష్యత్తులో ఆ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు అవసరమైన సలహాలు, సూచనలు తీసుకునేందుకు జిల్లాలో గల 385 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఎస్విఎస్ఎన్.వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. **యు.కొత్తపల్లి** ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగానే గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. ఉప్పాడ గ్రామసభలో ఎంపి పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కేంద్రంతో మాట్లాడి అత్యధిక నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఉప్పాడ బీచ్ రోడ్డుకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. కొత్తపల్లి గ్రామ సభలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. **కిర్లంపూడి** మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. సోమవారం, కృష్ణవరం గ్రామసభల్లో ఎంఎల్ఏ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, సర్పంచులు, ఎంపిటిసిలు, టిడిపి నాయకులు ఎస్విఎస్అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు, తహశీల్దార్ చిరంజీవి, ఎంపిడిఒ రాజేశ్వరరావు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని ఆయా గ్రామాల్లో 2024-25లో చేపట్టాల్సిన ఉపాధి చట్టం ప్రకారం పనులపై గ్రామ సభలు నిర్వహించారు. ఎంపిడిఒ ప్రేమ్సాగర్, ఎపిఒ సురేష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. **సామర్లకోట** మండలంలోని 18 గ్రామాల పరిధిలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించారు. అచ్చంపేట, పనసపాడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. ఉండూరు పంచాయతీ గ్రామ సభలో అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గతంలో చేసిన పనులపై వివరణ ఇవ్వాలని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. దీనిపై ఎంపిడిఒ శ్రీలలిత మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న గ్రామ సభ గతంలో చేసిన పనుల కోసం కాదని, కొత్తగా చేపట్టే పనులను గుర్తించేందుకు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఒ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు జరిగాయి. ఆర్యభట్టం గ్రామసభలో ఎంపిడిఒ నాగేశ్వర శర్మ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** మండలంలోని పంచాయతీల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. వాకలపూడిలో జరిగిన గ్రామసభలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సభ ప్రత్యేక అధికారి నాగ భూషణం, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రసాదరావు, పంచాయితీ కార్యదర్శి పాండు రంగారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద గ్రామ సభలు జరిగాయి. కొరిపల్లి, కొంగోడు గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఎంఎల్ఎ పంతం నానాజీ పాల్గొని మాట్లాడారు. కరప గ్రామ సభలో తాగునీరు, డ్రెయినేజీ, రోడ్ల సమస్యలపై అధికారులను, నాయకులను ప్రజలు నిలదీశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఒ కె.అప్పారావు, సర్పంచ్ నక్కా అప్పలస్వామి, నాయకులు చప్పిడి వెంకటేశ్వరరావు, ఆట్ల గోవిందు, భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్ పాల్గొన్నారు. **శంఖవరం** మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరిగాయి. కత్తిపూడి గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బద్ది రామారావు, జ్యోతుల శ్రీను, కరణం సుబ్రహ్మణ్యం, మేకల కృష్ణ, గౌతు నాగు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని తాళ్లూరు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. గండేపల్లి గ్రామంలో సర్పంచ్ లలిత అధ్యక్షతన ఎంపిడిఒ బిఎస్.రామన్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, పోతుల మోహనరావు ఎస్విఎస్.అప్పలరాజు, కందుల చిట్టిబాబు, సర్పంచ్ శిలామంతుల వీరబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. వాలుతిమ్మాపురం గ్రామంలో సర్పంచ్ సైనం బుల్లెమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఉపాధి హామీ పథకం ఎపీడీ భానుకుమార్ పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలోని రామవరం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిడిఒ వసంత్కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్మోహన్

## ఎస్సి ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - పిఠాపురం, తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో ఎస్సిలు నివసించే ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సింహాచలం, నాయకుడు డి.శ్రీను కలెక్టర్ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ షాన్మోహన్తో వారు మాట్లాడారు. గ్రామ సభల్లో ఎస్సి, ఇతర పేదలు నివసిస్తున్న కాలనీలలో రోడ్లు, డ్రెయిన్లు, స్మశాన వాటికల అభివృద్ధి, ఇళ్ల స్థలా ల లెవెలింగ్, పాత హౌసింగ్ కాలనీల మరమ్మతులు వంటి పనులను గుర్తించి నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. అలాగే తాళ్లరేవు మండలం కోరంగిలో జరిగిన గ్రామ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు ఎంపిడిఒ ఎం.అనుపమను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని, గతంలో తొలగించిన జంగిల్ క్లియరెన్స్ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు.

కలెక్టర్కు వినతిపత్రం ఇస్తున్న వ్యకాసా నాయకులు

## రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడిలో నిర్వహించిన గ్రామసభలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ నెలకొంది. గ్రామసభలో సమస్యలపై అభిప్రాయాలను తెలపాలని పంచాయతీ అధికారులు కోరారు. డ్రెయిన్లలో పూడికను పంచాయతీ తీయిస్తుంటే కొందరు కావాలనే తిరిగి డ్రెయిన్లను పూడ్చేలా చేస్తున్నారని సర్పంచ్ సుబ్రమణ్యం గ్రూపునకు చెందిన రామకృష్ణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సమస్యలు తెలిపేందుకు వచ్చిన తమపై నిందలు వేస్తున్నారంటూ జనసేనకు చెందిన పలువురు నిలదీశారు. గత ఐదేళ్లలో పంచాయతీని ఏ రూపంలోనూ అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. సర్పంచ్ వర్గానికి చెందిన రామకృష్ణకి కన్ను కింద గాయం అయింది. జనసేనకు చెందిన బాబురావు, వీరాస్వామి, శివాజీలు గాయాలపాలయ్యారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వర్గానికి చెందిన వ్యక్తులు తమపై దాడికి పాల్పడ్డారని సర్పంచ్ వర్గీయులు అన్నారు. జనసేనకు చెందిన బాబురావు మాట్లాడుతూ గ్రామ సభ ప్రశాంతంగా జరుగుతుంటే వైసిపి సర్పంచ్ వర్గీయులు వచ్చి కుర్చీలు విసిరారని ఆరోపించారు.

ఘర్షణలో చెల్లాచెదురైన కుర్చీలు(ఇన్సెట్లో గాయంతో సర్పంచ్ వర్గీయుడు)

## కార్టూ'నిజం'




## ఆదిత్య ఇఇఇలో అతిథి ఉపన్యాసం

సదస్సులో మాట్లాడుతున్న ఎల్ అండ్ టి కంపెనీ ప్రతినిధి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఇఇఇలో 'ఎలక్ట్రిక్ వెహికల్స్ వర్కింగ్ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ ప్రోసెస్" అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎల్ అండ్ టి ఆటోమొబైల్ ఇంజనీర్ మహబూబ్ ఉర్ రహమాన్ మహమ్మద్ పాల్గొని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రో ఛాన్సలర్ డాక్టర్. ఎన్.సతీష్ రెడ్డి ప్రస్తుత రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాల ప్రాముఖ్యత మరియు వాటి అభివృద్ధి గురించి వివరించారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్.ఎం. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికంగా ఎలక్ట్రిక్ వాహనాలు నేటి టెక్నాలజీకి అనుగుణంగా వివిధ ఫీచర్లతో క్రమంగా మారుతున్నాయని, వాటి పనితీరు తదితర విషయాలు విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడు నాగబాబుకు నివాళి

ప్రజాశక్తి - సామర్లకోట

ఫార్మా కంపెనీ పేలుడులో మృతి చెందిన నాగబాబు మృతదేహానికి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప నివాళులర్పించారు. సామర్లకోట గాంధీ నగరంకు చెందిన మొండి నాగబాబు(39) సెజ్లో ఫార్మ కంపెనీలో సహాయ మేనేజర్గా పనిచేస్తున్నారు. ఈ నెల 21న జరిగిన ప్రమాదంలో నాగబాబు మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్థానిక గాంధీ నగరంలో ఉన్న ఆయన స్వగృహానికి తీసుకొచ్చారు. దీంతో ఎంఎల్ఎ చినరాజప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. శుక్రవారం తెల్లవారుజామున మండల తహశీల్దార్ కె.చంద్రశేఖరరెడ్డి, పట్టణ టిడిపి కార్యదర్శి బడుగు శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రూ.కోటి చెక్కును నాగబాబు భార్య సాయిదుర్గకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కంటే జగదీష్మోహన్, కౌన్సిలర్ బలుసు వాసు పాల్గొన్నారు.

పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చినరాజప్ప

## సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

నాగులపల్లి సర్పంచ్ చెక్ పవర్ను రద్దు చేస్తూ శుక్రవారం డిపిఒ ఉత్తర్వులు జారీ చేశారని ఇఒపిఆర్డి భాస్కర్ రావు తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని గ్రామస్తులు గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన అధికారులు ఈ ఏడాది మార్చి నెలలో సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి చెక్ పవర్ను రద్దు చేశారు. నిధుల దుర్వినియోగంపై తనకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సంబంధం లేదని కలెక్టర్కు అప్పీల్ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆ అప్పీల్పై సంబంధిత శాఖ అధికారులు మరోసారి విచారణ చేశారు. అయితే ఆ అప్పీల్లో సంబంధిత ఆరోపణలకు సంబంధించి ఇచ్చిన వివరణ సహేతుకంగా లేదని నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం 6 నెలలపాటు చెక్పవర్ను రద్దు చేస్తూ డిపిఒ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు.

## ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడ

ఇస్రో శాస్త్ర వేత్తల కృషి అభినంద నీయమని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినిల్ అన్నారు. శుక్రవారం స్థానిక జగన్నాథపురం బిఆర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలి కోన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం సంద ర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం అయిన నాటి నుంచి ఆగస్టు 23న ప్రతి ఏడాది జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ, కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆకాశ వీధుల్లో ఇస్రో జైత్రయాత్ర కొనసాగుతుందని తెలిపారు. అనేక విజయాలు దేశానికి స్ఫూర్తి నింపిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషి అంకితభావన్ని మనం గుర్తించాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని వి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రాకెట్ల నమూనాలు తయారు చేశారు. నమూనాల తయారీ, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.జయశ్రీ, డాక్టర్ వి.కనక మహాలక్ష్మి, వి.ఉత్తర శిరీష, ఎ. సుభద్రాదేవి, ఎ.శ్రీదేవి, ఎస్ సూర్య కుమారి, ఎ. నాగమణి పాల్గొన్నారు.

తయారు చేసిన నమూనాలతో విద్యార్థులు

# నేరాలు ఘోరాలు

పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

## 800 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -గోకవరం

గోకవరంలో 800 కేజీల గంజాయిని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గోకవరం మండలం కృష్ణుని పాలెం గ్రామపంచాయతీ పరిధి రామన్నపాలెం వద్ద ఏజన్సీ ప్రాంతమైన మరేడుమిల్లి నుండి గోకవరం వైపుగా బొలెరో వ్యాన్‌లో గంజాయిని తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. గంజాయి ఉన్న బొలెరో వ్యాన్‌ను గుర్తించారు. వ్యాన్‌ను తనిఖీ చేస్తుండగా నిందితులు పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు

ప్రజాశక్తి - జగ్గంపేట, సామర్లకోట

జగ్గంపేట స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా, ఒకరికి జైలు శిక్ష పడింది. ఎస్ఐ టి.రాఘునాథరావు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గంపేట పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని శుక్రవారం పెద్దాపురం కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. వీరిలో ముగ్గురికి రూ.10 వేలు చొప్పున, ఒకరికి 3 రోజులపాటు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి జి.కృష్ణ శేషచార్య తీర్పు చెప్పారని అన్నారు. అలాగే సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ముగ్గురు వ్యక్తులకు 2 రోజుల జైలు శిక్షను కాకినాడ రెండవ స్పెషల్ జ్యుడిషియల్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చిందని ఎస్ఐ పివిఎస్ఎస్.సురేష్ తెలిపారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక కాళీపేటలో శుక్రవారం తెల్లవారు జామున ఒక ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం అయింది. బాధితుడు దుమ్మర్తి సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అకస్మాత్తుగా ఇంట్లో మంటలు వ్యాపించాయన్నారు. తమ కుటుంబం ప్రాణ భయంతో కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశామన్నారు. సుమారు రూ.4 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

# ఘనంగా టంగుటూరి జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం

**కాకినాడ** జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ పిఠాపురం రాజా సర్కిల్ వద్ద ఉన్న అమర జవాన్ పార్కులోని ప్రకాశం పంతులు విగ్రహానికి కలెక్టర్ షాన్‌మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో భాగంగా నిర్వహించిన సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటం, సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాల్లో టంగుటూరి ప్రకాశం పంతులు చూపిన ధైర్య సాహసాలు అమూల్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, తహశీల్దార్ జితేంద్ర, సెట్రాజ్ మానేజర్ కె.కాశీవిశ్వేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరేళ్ల వీరరాఘవ, గోకేడ అప్పారావు, మాజీ కౌన్సిలర్ గుర్రాల యాకోబు, కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, సయ్యద్ జానీ, పండు, డిఇ ఇ.ఆదినారా యణరావు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎస్.శ్రీ నగేష్, అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు. **సామర్లకోట** మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ ఛైర్మన్ ఊబా జాన్‌మోజెస్‌లు ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి, కౌన్సిలర్ పితాని కృష్ణ, పాల్గొన్నారు. **ఆత్రేయపురం** మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంపిడిఒ నాతి బుజ్జి, పరిపాలనాధికారి టివి.సురేంద్ర రెడ్డి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఎంపిడిఒ నాతి బుజ్జి మాట్లాడుతూ కొదమ సింహంలా బ్రిటిష్ వారిపై విరిచుకుపడిన ధీరత్వం ప్రకాశం పంతులు గారిదన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

**అంబాజీపేట** టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్య సహసాలను, త్యాగనిరతిని స్ఫూర్తిగా తీసకుకోవాలని ఎంపిడిఒ జి.వి.సరోవరరావు సూచించారు. తొండవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు) అధ్యక్షతన టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన సేవలను కొనియాడారు. అంబాజీపేట హైస్కూలులో హెచ్ఎం కె.సాయిరాం ఆధ్వర్యంలో టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, బిఎస్ఎన్.మూర్తి, ఎమ్. సూర్యనారాయణ, నందిక వెంకటేశ్వరరావు, ఎంపిటిసి వాకపల్లి దొరబాబు, పితాని కేశవ పంచాయతీ సెక్రటరీ వి.లక్ష్మీపతి పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం** మండలంలోని పలు గ్రామాల్లో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. అంగర గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, తహశీల్దారు పి.చిన్నారావు, టిడిపి అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రకాశం పంతులు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్ర, వీరన్న బాబు, ఎంపిటిసి అడ్డాల శ్రీనివాస్, కార్యదర్శి టి.సుభాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోటలో నివాళులర్పిస్తున్న ఛైర్‌పర్సన్, ఇతరులు

పెద్దాపురంలో నివాళులర్పిస్తున్న ఛైర్‌పర్సన్, ఇతరులు

# ఆత్మరక్షణపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ మౌనిక పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక లూథరన్ హైస్కూల్లో సీఐ క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల ప్రాముఖ్యత పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాఠశాల స్థాయి నుంచి బాలికలు ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎవరైనా బాలికలపై దాడికి ప్రయత్నిస్తే ఎలా అడ్డుకోవాలో, ఎలా తమను తాము కాపాడుకోవాలో ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎన్.ఫిలిప్‌రాజు, కరస్పాండెంట్ జి.నళిని, విక్టర్ బాబు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మౌనిక

# అర్బన్ గ్రామాలను విలీనం చేయించండి

ఎంఎల్‌సికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచులు

ప్రజాశక్తి - కాకినాడ

అర్బన్ గ్రామాలను కాకినాడ నగరంలో విలీనం చేయించేందుకు కృషి చేయాలని మాజీ ప్రజా ప్రతినిధులు ఎంఎల్‌సి వనమాడి కొండబాబును కోరారు. శుక్రవారం రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఎంఎల్‌ఎను కలిసి అర్బన్ గ్రామ పరిస్థితిని వివరించారు. ఈ సమస్యను రూరల్ ఎంఎల్ఏతో సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గింజాల శ్రీనివాస్, పితాని అప్పన్న, పలివెల వీరబాబు, మాజీ ఎంపిటిసి సభ్యులు మాసుమేను గంగయ్య, పెంకే రాధామనోహార్, మాజీ ఉప సర్పంచ్ సలాది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కుమారి

## బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి - పిఠాపురం

మండల తహశీల్దార్‌గా ఎస్ఎల్ఎన్.కుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో సామర్లకోట తహశీల్దార్‌గా, ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లాలో విధులు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చిత్రాడలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

**In the Court of the VI Additional District Judge at Kakinada**
**A.S. No. 34/2020**
*Between:*
Sabbella Ammireddy ...*Appellant*
AND
1. Inti Sridevi
2. Chodisetti Venkataratnam ...*Respondents*
*To:*
*R-2:* Chodisetti Venkataratnam, S/o. Satyam, aged 54 years, Business, D.No. 2-1-46, Plot No. 103, Srirangarayanim Residency, Srinagar Colony, Kakinada.
పై నెంబరు అప్పీలు దావాలో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు దావా సమన్లు పంపిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 19-9-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
**డి.సుబ్రహ్మణ్యం**
**వి.వి.ఎస్.ఎల్.కిరణ్**
**ఎం.ధనుంజయరావు,** అడ్వకేట్స్
సుభద్రా ఆర్కేడ్, కాకినాడ
సెల్: 9849715132

## ఓటరుగా నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికకు సంబంధించి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ బి.ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో నివాసిగా ఉండాలి. సెకండరీ స్కూల్ పైస్థాయి విద్యాలయాల్లో పనిచేసే ఉపాధ్యాయులు అర్హులు. గడిచిన ఆరేళ్లలో మూడేళ్ల సెకండరీ, హైస్కూల్ విద్యాలయాల్లో ఉపాధ్యాయునిగా పని చేసి ఉండాలి. ఫారం 19లో వివరాలు పూర్తి చేసి సంబంధిత తహశీల్దార్ లేదా ఎంపిడిఒకు అందించాలన్నారు. ప్రభుత్వ హైస్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులు సంబంధిత హెచ్ఎం ద్వారా దరఖాస్తు సమర్పించాలనా్రు. ప్రయివేటు స్కూల్స్ ఉపాధ్యాయులు హెచ్ఎం సంతకంతో ఎంఇఒ ద్వారా కౌంటర్ సిగ్నేచర్ చేయించాలన్నారు. రుజువుగా శాలరీ స్టేట్‌మెంట్, ఇపిఎఫ్ స్లిప్‌లు మూడు సంవత్సరాల కాలానికి సమర్పించాలన్నారు. ఐటిఐలలో పని చేసే ఉపాధ్యాయులు డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, ఎంప్లాయ్‌మెంట్ డిడి ద్వారా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే వారు ప్రిన్సిపల్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూషన్ ద్వారా, ప్రయివేటు జూనియర్ కాలేజీలో పనిచేసే వారు రీజనల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్, కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ద్వారా, డీమ్డ్ యూనివర్సిటీలో పనిచేసే ఉపాధ్యాయులు లోకల్ ఆర్‌డిఒ, డిస్ట్రిక్ కలెక్టర్, హిజ్ నామిని ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేస్తున్న ఏపి బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం విధుల్లో నల్ల రిబ్బన్లు ధరించిన నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా నాణ్యమైన మద్యం అందిస్తామని అంటున్నారు తప్ప షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది ఉద్యోగాల విషయమై ఎటువంటి స్పష్టతా ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా మహమ్మారి సమయంలో తాము రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రాణాలకు సైతం లెక్క చేయక విధులు నిర్వర్తించామని గుర్తు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ సమస్యపై దృష్టి సారించాలని, ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

## లారీ ఢీకొని 30 మేకల మృత్యువాత

ప్రజాశక్తి-నల్లజర్ల

చీపురుగూడెం వద్ద సుమారు 30 మేకల పైనుంచి లారీ దూసుకెళ్లడంతో మేకలన్నీ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. లారీ వేగాన్ని గుర్తించిన యజమాని గొర్రెల చంద్రయ్య పక్కనే ఉన్న పంట పొలంలోకి దూకి ప్రాణాలు రక్షించుకున్నట్లు స్థానికులు తెలిపారు. కొయ్యలగూడెం వైపు నుంచి నల్లజర్ల వైపు వెళుతున్న లారీ అతివేగం వచ్చి రోడ్డుపై వెళ్తున్న మేకలను గుద్దడంతో స్థానికులు ఆందోళనకు దిగారు.

# ఆదిస్ హాస్పిటల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మిరపకాయల వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిస్ హాస్పిటల్స్‌ను శుక్రవారం ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డాక్టర్ గుమ్మళ్ల సౌమ్య మాట్లాడుతూ తాను ఎంబిబిఎస్ పూర్తి చేసి ఫెల్లోషిప్ చేస్తున్నానన్నారు. పెద్దాపురం పట్టణ వాసులకు వైద్య సేవలు అందించాలని భావించి హాస్పిటల్ ప్రారంభించాన న్నారు. త్వరలోనే వివిధ రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, దేవళ్ళ సతీష్, తోట రాంజీ, బాలు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

## బాధ్యతలు స్వీకరించిన కరప ఎస్ఐ

ప్రజాశక్తి - కరప

కరప పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పసుపులేటి శోభన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన పెదపూడి పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు.

ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న తహశీల్దార్

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం గండేపల్లి నుంచి రంగంపేట వెళ్లే దారిలో పోలవరం కెనాల్ సంబంధించిన భూమిని పరిశీలించారు. కెనాల్ భూమిని ఆక్రమించినట్లు వచ్చిన ఫిర్యాదుపై ఆయన విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు మూడున్నర ఎకరాల పోలవరం కాలువను ఆక్రమించి ఫామాయిల్ తోటను వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఇరిగేషన్ శాఖ అధికారులతో చర వాణి ద్వారా మాట్లాడుతూ ఆక్రమించిన భూమి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ పర్యటనలో టిడిపి మండల అధ్యక్షులు మోహనరావు, వితార్ఒ కృష్ణ, గ్రామ నాయకులు బోల్లంరెడ్డి రామకృష్ణ, పైల వెంకన్న, కన్నబాబు, పాల్గొన్నారు.

**మహారాజశ్రీ ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**O.S. No. 53/2024**
*Between:*
1. మామిడి శ్రీనివాసు, తండ్రి: లేటు సూర్యారావు, జి.కొత్తపల్లి, శంఖవరం మండలం, కాకినాడ జిల్లా. **-వాది**
మరియు
1. పల్లా గోవిందు, తండ్రి: పెద్ద సోమరాజు, జి.కొత్తపల్లి, శంఖవరం మండలం, కాకినాడ జిల్లా. **-ప్రతివాది**
పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు వారి నుంచి ఎన్నిసార్లు సమన్లు పంపించిన మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు నిమిత్తం శ్రీ కోర్టు వారు **ది. 06-9-2024వ తేదీన ప్రకటన ద్వారా వాయిదా వేసియున్నారు.** సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని కోర్టు వారి ఎదుట **ఉదయం 10.30 ని||లకు** హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావా పరోక్షమందు తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ననుసరించి)
**కొమ్మూరి సూర్యనారాయణమూర్తి**
అడ్వకేట్, ప్రత్తిపాడు
సెల్: 78939 40955

**NAME CHANGE**
I, GULIVINDALA PRATAP, S/o. GULIVINDALA RAMA RAO, D.No. 4-3-107/4, Achayamma Colony, Kovvuru, W.G.Dist., A.P. have changed names **GULIVANDALA PRATAP, S/O. GULIVANDALA RAM RAO** (Old Name) to **GULIVINDALA PRATAP, S/O. GULIVINDALA RAMA RAO** (New Name). Hence after all my documents and correspondence will be continue with new names **GULIVINDALA PRATAP, S/O. GULIVINDALA RAMA RAO.**

**In the Court of the Ist Additional Senior Civil Judge at Kakinada**
**O.S. No. 120/2023**
*Between:*
Marni Veera Venkata Satya Krishna Chowdary ...*Plaintiff*
AND
Chunduri Padmaja ...*Defendant*
*To:*
***Defendant:*** Chunduri Padmaja, W/o. Perla Seetharamayya, Hindu, Business, D.No. 10-1-42/3, Gandhi Nagar, Ramaraopeta, Kakinada, Kakinada District.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు దావా సమన్లు పంపిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 03-9-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
**K.V.S.V.LAKSMAJI RAO**
Advocate, D.No.6-1-9/1,
Dusarlapudi vari Street, Kakinada
Cell: 9866211196

**In the Court of the Ist Additional Senior Civil Judge at Kakinada**
**I.A. No. 120/2023 in O.S. No. 120/2023**
*Between:*
Marni Veera Venkata Satya Krishna Chowdary ...*Petitioner/ Plaintiff*
AND
Chunduri Padmaja ...*Respondent/ Defendant*
*To:*
***Respondent:*** Chunduri Padmaja, W/o. Perla Seetharamayya, Hindu, Business, D.No. 10-1-42/3, Gandhi Nagar, Ramaraopeta, Kakinada, Kakinada District.
పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారాను, పోస్టల్ ద్వారాను ఎన్నిసార్లు నోటీసులు పంపిన మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 03-9-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం|| 10.30 ని||లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
**K.V.S.V.LAKSMAJI RAO**
Advocate, D.No.6-1-9/1,
Dusarlapudi vari Street, Kakinada
Cell: 9866211196

# వివేకానందలో విలువలతో కూడిన విద్య

ప్రజాశక్తి-రామచంద్రపురం

విలువలతో కూడిన అందిస్తున్న శ్రీ వివేకానంద స్కూల్ మరింత ఉన్నతమైన విద్యను విద్యార్థులకు అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అభిలషించారు. పట్టణంలోని శ్రీ సిటీలో శ్రీ వివేకానంద స్కూల్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత 35 సంవత్సరాలుగా విద్యారంగంలో రాణిస్తున్న వివేకానంద స్కూల్స్ కాకినాడలోను సామర్లకోటలోను రాయవరంలోనూ రామచంద్రపురంలో ఎంతమంది విద్యార్థులను తీర్చిదిద్దుతోందని ఆయన గుర్తు చేశారు. విద్యలో మరింత నాణ్యతగా విద్యార్థులను తీర్చిదిద్ది జాతీయస్థాయి గుర్తింపు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరస్పాండెంట్ సరోజిని, చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విలువలతో క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఆధునిక కంప్యూటర్ విద్యతోపాటు జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు ఆధునిక సైన్సు ల్యాబ్, మేథ్స్ ల్యాబ్‌లు ఏ ర్పాటు చేశామని పల్లె ప్రాంతాల్లోని విద్యార్థులను ఆధునిక విద్య విజ్ఞానం వైపు మళ్ళించి వారిని అభివృద్ధి చేసేందుకు శ్రీ వివేకానంద స్కూల్స్ శ్రమిస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలూషా, డీన్ వికాషా, వివిధ పాఠశాల కరస్పాండెంట్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాష్

**In the Court of the Principal Senior Civil Judge, Kovvur**
**O.S. No. 172/2012**
*Between:*
శ్రీ చిరవూరి సత్యనారాయణ **-వాది**
మరియు
శ్రీమతి వాకచర్ల నాగలక్ష్మి, వగైరా **-ప్రతివాదులు**
*To:*
***3వ ప్రతివాది:*** వాకచర్ల రమ్యమణి దేవి కృష్ణ, తండ్రి: లేటు రమేష్‌బాబు, దేవరపల్లి, దేవరపల్లి మండలం.
పై నెంబరు దావాలో దావా సంగతులు తెలియజేయు నిమిత్తం 3వ ప్రతివాదికు కోర్టు ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు దావా సమన్లు పంపినప్పటికి సదరు 3వ ప్రతివాది బుద్ధిపూర్వకముగా Avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా దావా సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు దావాలో మీకు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల **ది. 02-09-2024వ తేదీన ఉదయం 10.30 ని||లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవచ్చును. లేనియెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
***వాయిదా: 02-09-2024***
**ఆత్కూరి సత్యనారాయణ**
వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు, తూ||గో||జిల్లా
కొవ్వూరు
ది.10-08-2024
సెల్: 9849847197

**మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం**
**I.A. 1557/2019**
**I.A. 1558/2019 in**
**O.S. 57/2017**
*Between:*
Sidda Annapurna ...*Petitioner/ Plaintiff*
AND
Badireddy Buli Venkata Dora and Others ...*Respondents/ Defendants*
***6:*** Badireddy Venkata Naga Gangadhar, S/o. Rama Krishna, Hindu, aged 40 years, Employment, R/o. Panchayat Office Road, Kolamuru Village, Rajahmundry Rural Mandal.
...*6th Respondent/ Defendant*
పై నెంబరు గ్రంథంలో 6వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 30-8-2024 సం||రం తేదీ ఉదయం 10.30 ని||లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై గ్రంథంలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు గ్రంథను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
20-8-2024 అడ్వకేట్, రాజమండ్రి

# జెడ్‌పి హైస్కూల్ ఆట స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యాసంస్థకు కేటాయించిన స్థలాన్ని కొంతమంది ఆక్రమిస్తూ ఉంటే అధికారులు, స్థానిక నాయకులు చోద్యం చూస్తున్నారు. పి.మల్లవరం పంచాయతీ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గ్రామకంఠం భూమి నాలుగు ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు 2021 మార్చి 20వ తేదీన తూర్పు గోదావరి జిల్లా పరిషత్ ద్వారా పాఠశాల ఆట స్థలంతో కలిపి 4 ఎకరాలు పాఠశాలకు అప్పగించారు. పాఠశాల భవనాలతో పాటు కొంత స్థలంలో ప్రహరీ గోడ నిర్మించారు. ప్రహరీ గోడ అవతల సుమారు రెండు ఎకరాల ఆటస్థలం ఉంది. దీనిలో కొంత భాగం పల్లపుప్రాంతం కావడంతో వర్షం నీరు నిలిచిపోయి క్రీడాస్థలంకు అనుకూలంగా లేదు. దీనిలో ఎడమవైపు కొంత భాగం ఎత్తుగా ఉంది. ఆ ఎత్తుగా ఉన్న ప్రాంతంలో కొంత స్థలాన్ని అన్యాక్రాంతం చేసి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని, హైస్కూల్‌ఉ కేటాయించిన మొత్తం స్థలాన్ని సర్వే చేయించి ఇవ్వాలని 2024 ఫిబ్రవరి 26వ తేదీన పి.మల్లవరం జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పాలెపు వెంకట శ్రీనివాసరావు పి.మల్లవరం పంచాయతీకి ఫిర్యాదు చేశారు. దీనిపై పంచాయతీ అధికారులు జరుగుతున్న నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని నోటీసు జారీ చేశారు. అదే స్థలంలో ఇటీవల మరో ఇంటి నిర్మాణం చేస్తున్నారు. దీనిపై హైస్కూల్ హెచ్.ఎమ్. వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ హైస్కూల్‌కు సంబంధించిన నాలుగు ఎకరాలు సర్వే చేసి ఇవ్వాలని దరఖాస్తు చేసామన్నారు. అయితే ఇంతవరకు సర్వే చేసి స్థలాన్ని అప్పగించలేదని తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణను వివరణ కోరగా గతంలో ఒక నిర్మాణాన్ని నిలుపుదల చేశామని, ఇప్పుడు జరుగుతున్న నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేస్తామని తెలిపారు. స్థానిక మహిళా పోలీసు, పంచాయతీ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఆక్రమణదారులకు తెలియజేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. మండల సర్వేయర్ ద్వారా జిల్లా పరిషత్ హైస్కూల్ స్థలాన్ని సర్వే చేయించాలని, సచివాలయ సర్వేయర్ అపర్ణ ద్వారా తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయానికి మంగళవారం పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ దరఖాస్తు పంపించారు. అయితే హైస్కూల్ హెచ్‌ఎం ఫిర్యాదు చేసి ఐదు నెలలు గడిచిన సరైన చర్యలు చేపట్టకపోవడంతోనే మరిన్ని ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు తెలియజేస్తున్నారు. ఇకనైనా మండల, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమస్యపై దృష్టి సారించి ఆక్రమణలను తొలగించి హైస్కూల్‌కు చెందిన నాలుగు ఎకరాల స్థలాన్ని హైస్కూల్‌కు అప్పగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణకు గురైన పి.మల్లవరం హైస్కూల్ ఆట స్థలం